# సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023






## కరెంట్ బిల్లుల 'కట్'కట!

మండల పరిషత్ కరెంట్ బిల్లులు సైతం కట్టలేని పరిస్థితిలో ఉన్నామని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు.

వివరాలు 8లో ▸



## చెదిరిన కల!

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ప్రభుత్వం మళ్లీ రద్దు చేసింది.

వివరాలు 8లో ▸

## నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగుల కోసం జిల్లా ఉపాధి కార్యాలయంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అధికారి వందన శనివారం తెలిపారు. మెట్రో టెక్ సొల్యూషన్‌లో వెయ్యి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు.








# జనసంద్రంలో పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు

- జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో నిరంతర అన్నదానం ప్రారంభం
- విద్యా పీఠానికి రూ. 10.85 లక్షల విరాళం
- గణేష్ గడ్డ నుండి గోకుల్ ఫంక్షన్ హాలు వరకు భారీ బైక్ ర్యాలీ
- ఐబి వద్ద గజమాలతో పిఎంకె అభిమానుల సత్కారం
- 50 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- ఆసుపత్రికి అంబులెన్స్, ఆరుగురు దివ్యాంగులకు స్కూటీల పంపిణీ













## అడుగడుగునా జన నీరాజనం

కొండాపూర్ (సంగారెడ్డి) : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో అట్టహాసంగా జరిగాయి. ముందుగా ఉదయం తన స్వంత గ్రామమైన ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యా పీఠంలో, అనంతరం గణేష్ గడ్డలో గల వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంగారెడ్డి వరకు పీఎంకే యువ సేన సభ్యుల సమక్షంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ప్రారంభమైన ర్యాలీ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. సంగారెడ్డికి కాబోయే ఎమ్మెల్యే పట్నం మాణిక్యం అన్న అంటూ నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి పట్టణంలోకి చేరింది. సంగారెడ్డి లోని ఐబీ వద్ద అభిమానుల సమక్షంలో ఆయన మాట్లాడుతూ అభిమానుల కోరిక మేరకు త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయడంతో పాటు గెలిచి సంగారెడ్డి అసెంబ్లీ సీటును కేసీఆర్‌కు కానుకగా ఇస్తానన్నారు. అనంతరం ఐబీ నుండి ప్రారంభమైన ర్యాలీ కొండాపూర్‌లోని గోకుల్ ఫంక్షన్ హాల్‌కు రాత్రి 8 గంటలకు చేరుకుంది, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై అభిమానులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు.

- అట్టహాసంగా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం జన్మదిన వేడుకలు
- స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించిన పీఎంకే యువసేన సభ్యులు
- దివ్యాంగులకు స్కూటీలు, మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ

### దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ

తన పుట్టిన రోజును పురస్కరించుకొని పట్నం మాణిక్యం వికలాంగులకు 6 త్రి స్కూటీలు, మహిళలకు 50 కుట్టు మిషన్‌లు, సంగారెడ్డిలోని జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్ అందించారు.

ఇదే కాకుండా పీఎంకే యువసేన సభ్యులు తన అభిమాన నాయకుడి పుట్టినరోజును పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన ఆడ పిల్లలకు రూ.14 వేలు, మగ పిల్లలకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు కేవలం సంగారెడ్డి నియోజకవర్గమే కాకుండా జిల్లా నలుమూలల నుండి పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.







## క్లుప్తంగా

### ఉపాధ్యాయులను నియమించాలని వినతి

నారాయణఖేడ్: ఉపాధ్యాయులను నియమించాలని సామాజిక కార్యకర్తలు కృష్ణయాదవ్, నాయికోటి అమేర్ శనివారం డీఈవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని పంచగామ ప్రాథమిక పాఠశాలకు బదిలీల్లో భాగంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నియమించాలన్నారు. వారి కొరతతో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోందని వివరించారు. రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడిని, మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

### 26న అధికారికంగా ఐలమ్మ జయంతి: కలెక్టర్

సంగారెడ్డి టౌన్: ఈనెల 26న చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ శరత్ శనివారం తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ పక్కన గల ఆమె ఐలమ్మ విగ్రహానికి ఆ రోజు ఉదయం 10.30 గంటలకు పూలమాలలు వేసి నివాళి కార్యక్రమం ఉందని వెల్లడించారు. అనంతరం గ్రీవెన్స్ హాల్లో సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, అధికారులు ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

### పత్తి పంట ధ్వంసం

వట్‌పల్లి (ఆందోల్): గుర్తుతెలియని వ్యక్తులు పత్తి పంటను ధ్వంసం చేశారు. మండలంలోని కన్సాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతులు మల్లేశం, ఎరగొల్ల నారాయణ రెండెకరాల పత్తి సాగుచేశారు. ఎకరా మేర పత్తి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా అవి ధ్వంసమై ఉండడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ.1.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.



# చెదిరిన కల!

**గ్రూప్ 1 పరీక్ష రద్దు రెండో 'సారీ'**
- నిరుద్యోగుల ఆశలు.. అడియాసలు
- ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 12,921 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులు

సాక్షి, సిద్దిపేట: గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ప్రభుత్వం మళ్లీ రద్దు చేసింది. పరీక్ష కేంద్రంలో బయోమెట్రిక్ తీసుకోలేదని, హాల్‌టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్ ఇచ్చారని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. తొలి సారిగా అక్టోబర్ 22, 2022న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేశారు. రెండోసారి జూన్ 11న గ్రూప్–1 పరీక్షను నిర్వహించగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 19,733 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 12,921 మంది పరీక్ష రాశారు. ఇందులో సిద్దిపేట నుంచి 5,366, సంగారెడ్డిలో 5,396, మెదక్‌లో 2,159 మంది పరీక్ష రాశారు. మళ్లీ గ్రూప్–1 పరీక్ష కోర్టు రద్దు చేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా రోజుకు 18 గంటలకు పైగా చదివి పరీక్ష రాయగా తీరా రద్దు చేస్తుండటంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అయితే సెలవు పెట్టి మరీ



ప్రిపేర్ అయ్యారు. పరీక్ష బాగా రాశాం అని సంతోషించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. ప్రిలిమ్స్‌లో మంచి మార్కులు వస్తున్నాయని మెయిన్స్ సైతం ప్రిపేర్ అవుతున్న సమయంలో హైకోర్టు కీలక ప్రకటన చేయడంతో ఆందోళన చెందుతున్నారు.

### నష్ట పరిహారం అందించాలి



గ్రూప్ వన్ ప్రిలిమినరీ రెండుసార్లు రద్దు అవడంతో అనేక సంవత్సరాలుగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయాం. అందువలన నష్టపోయిన అభ్యర్థులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.5లక్షలను ఆర్థిక సాయం అందించాలి. అదేవిధంగా గ్రూప్–1 రద్దుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి.

– అశోక్, ఎన్సాన్‌పల్లి

### కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని వదులుకుని..



చేగుంట మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో టీజీటీ తెలుగు కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పని చేశా. గ్రూప్–1 పరీక్ష కోసం ఆ పోస్టుకు రిజైన్ చేశాను. ఉన్న ఉద్యోగం పోయింది... కొత్త ఉద్యోగం వస్తది అనుకున్నది పరీక్ష రద్దు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడటం మంచిది కాదు.

– చల్ల శ్రీలత, చేగుంట

### నిరుద్యోగులకు శాపం



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే నిరుద్యోగులకు శాపంలా మారింది. సక్రమంగా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల రద్దుకు దారి తీసింది. ప్రైవేట్ జాబ్ మానేసి నెలల తరబడి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని ప్రిలిమ్స్ పరీక్ష రాయగా పేపర్ లీక్ పేరుతో రద్దు అయింది. ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా మళ్లీ పరీక్షలు నిర్వహించడంతో కోర్టు రద్దు చేసింది. డబ్బు, సమయం వృథా చేసి ఇంటికి దూరంగా ఉండి పరీక్షలు రాయగా ఫలితంలేకుండా పోయింది.

– రమేష్, జహీరాబాద్

### నూతన సభ్యులను నియమించాలి



గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలు రెండుసార్లు రద్దు అవ్వడానికి ప్రధాన కారణం టీఎస్పీఎస్సీ బోర్డు. దానిని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయాలి. అనంతరం మిగతా పరీక్షలు నిర్వహించాలి. ఒక్కసారి జరిగిన పొరపాట్లను మళ్లీ చేయడంతో నిరుద్యోగుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే గ్రూప్–1 పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కానీ ఇక్కడి ప్రభుత్వం విఫలమైంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ –1 పరీక్షలు నిర్వహణను సక్రమంగా నిర్వహించాలి.

– నీలిమ, సిద్దిపేట

### సమయమంతా వృథా



ఏళ్లతరబడి కష్టపడి చదివి సమయానికి తిండి లేకుండా, డబ్బు ఖర్చు పెట్టి గ్రూప్–1 పరీక్ష రాస్తే ప్రభుత్వం మా జీవితాలతో ఆడుకుంటుంది. ఎవరితోనో కోర్టులో పిటిషన్ వేయించి రద్దు చేయిస్తుంది. ఆర్థికంగా లేకున్నా రూ.20,000 ఖర్చు చేసి పుస్తకాలు కొనుగోలు చేసి ఏడాది నుంచి చదువుకుంటున్న. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. మళ్లీ పరీక్ష ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి. వయసు మీద పడుతుంది, కుటుంబ పోషణ భారమైంది.

– ఎరుకలి యాదగిరి, హత్నూర

## లారీ డ్రైవర్, క్లీనర్‌పై దాడి

పటాన్‌చెరు టౌన్: లారీ డ్రైవర్ క్లీనర్‌లపై దాడిచేసి, లారీని దొంగిలించేందుకు కొందరు దుండగులు ప్రయత్నించారు. ఈ ఘటన ఓఆర్ఆర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. బళ్లారి నుంచి వచ్చి రెండు లారీల్లో స్టీల్ లోడ్ తీసుకుని వచ్చి దిగుమతి చేశారు. ఓఆర్ఆర్ రహదారిపై కాళీమందిర్ ప్రాంతానికి చెందిన వినాయక మండలపాల నిర్వాహకులు రెండు కార్లలో వచ్చి లారీ అద్దాలు ధ్వంసం చేసి డ్రైవర్, క్లీనర్లను కొట్టి లారీని నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అక్కడికి చేరిన లారీ యజమానులు అడ్డుకుని నలుగురు యువకులను పట్టుకోగా కొంత మంది పారిపోయారు. వారు మరో 16 మందితో వచ్చి లారీ యజమానులపై మళ్లీ దాడికి దిగారు. దీంతో లారీ యజమానులు పట్టుకున్న నలుగురు యువకులను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేశారు.

## ఖోఖోలో విద్యార్థుల సత్తా

జహీరాబాద్ టౌన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో స్థానిక సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. అండర్ 17 విభాగంలో నలుగురు బాలురు, ముగ్గురు బాలికలు సత్తాచాటి 26, 27 తేదీల్లో జోగిపేటలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, పీఈటీ సుందర్ రాజ్ అభినందించారు.

## గోడ కూలి వాచ్‌మన్ మృతి



సంజీవ్ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: పాత గోడ కూలి వాచ్‌మెన్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలం అల్లాపూర్ మల్లపరిగి తాండాకు చెందిన సంజీవ్ రాథోడ్(40) బతుకుదెరువు కోసం పటాన్‌చెరు వలస వచ్చి వాచ్‌మన్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆయన పనిచేసే చోట రెండు భవనాల మధ్య ఉన్న మట్టితీసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న పాతగోడ సంజీవ్ రాథోడ్‌పై కూలింది. ఆయనను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## స్కూటీ టైర్ పంక్చర్.. ఒకరికి తీవ్రగాయాలు

### మాసాన్‌పల్లి చౌరస్తా వద్ద ఘటన



గాయపడిన రఘుపతి

కల్హేర్(నారాయణఖేడ్): స్కూటీ టైర్ పంక్చరై అదుపుతప్పి కింద పడగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కల్హేర్ మండలంలోని ఈ సంఘటన జరిగింది. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిన్నకోడప్‌గల్‌కు చెందిన రఘుపతి ఇద్దరు స్నేహితులతో కలిసి స్కూటీపై బాచేపల్లి వైపు వస్తున్నాడు. మాసాన్‌పల్లి చౌరస్తా వద్దకు రాగానే టైర్ పంక్చరైంది. వాహనం అదుపుతప్పి కింద పడటంతో రఘుపతికి తీవ్ర గాయలయ్యాయి. మిగతా వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు

# కరెంట్ బిల్లుల 'కట్'కట!

- సభలో ప్రజాప్రతినిధుల గోడు
- మంత్రి హరీశ్ దృష్టిలో ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ వెల్లడి
- పలు సమస్యలపై అధికారులను నిలదీసిన జెడ్పీటీసీలు



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సంగారెడ్డి అర్బన్: మండల పరిషత్ కరెంట్ బిల్లులు సైతం కట్టలేని పరిస్థితిలో ఉన్నామని అధికారులు సైతం కరెంటు కట్ చేస్తామని అంటున్నారని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ స్పందిస్తూ, ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు దృష్టిలో ఉంచామన్నారు. కరెంట్ బిల్లుల కోసం రూ.50 కోట్లు అడిగామన్నారు. త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. ఆమె అధ్యక్షతన శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, పంచాయతీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర అన్ని రంగాల అంశాలపై చర్చించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ శరత్ మాట్లాడుతూ, జిల్లాలో 80,857 మందికి రుణమాఫీ జరిగిందన్నారు. సుమారు 60 వేల మంది రైతులకు 358 కోట్ల రూపాయలు కొత్త రుణాలు ఇప్పించామని వెల్లడించారు. రెగ్యులర్ క్రాప్ లోన్ 70 శాతం పూర్తయిందని చెప్పారు. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ అవసరమైనన్ని ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో 85 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక క్యాంపులు పెట్టాలని డీఎంహెచ్ఓకు సూచించారు. శాసన మండలి సభ్యుడు యాదవరెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనన్నారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సింగూర్ కెనాల్ నాసిరకంగా నిర్మించిన అప్పటి కాంట్రాక్టర్ పై చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు స్పందిస్తూ, సదరు కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడుతున్నామన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ సభ్యులు అందరూ మళ్లీ అధికారంలోకి వచ్చేలా పనిచేయాలని సభ్యులను కోరారు. పంచాయతీ సెక్రటరీలు ఒకే చోట 10 సంవత్సరాల వరకు డ్యూటీ చేస్తున్నారని, వారిని వేరే ప్రదేశాలకు బదిలీ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం మాట్లాడుతూ, అన్ని వర్గాల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాలు వాటికి అవే సాటి అన్నారు. టీఎస్ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తస్వీర్ మాట్లాడుతూ, మనిషికి అవసరమైన అన్ని పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. తొలుత సమావేశంలో తనను మాట్లాడనివ్వడం లేదని జెడ్పీటీసీ రాజు రాథోడ్ వాకౌట్ చేశారు.

### అధికారులపై ప్రశ్నల వర్షం

జహీరాబాద్ ఆస్పత్రిలో రాత్రివేళ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు అధికారు లను నిలదీశారు. 'గుమ్మడిదలకు 108 వాహనం కేటాయించాలి. ఆరోగ్య మహిళా కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించాలి. మండల పరిషత్‌కు నిధులు ఇవ్వాలి. మన ఊరు మనబడి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులన్నీ వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. బీటీ రెన్యూవల్స్ చేయించాలి. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించాలి. బ్రిడ్జిలు, కల్వర్ట్ పనులు వేగవంతం చేయాలి' అని ప్రశ్నించారు. మన ఊరు మనబడి కింద పాఠశాల చైర్మన్లు సొంత డబ్బులతో ఖర్చు చేసి నిర్మాణాలు చేశారని, 9 నెలల నుంచి బిల్లు లు రాకపోవడంతో ఆందోళన చెందుతు న్నారని ఓ జెడ్పీటీసీ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం పెద్ద చెరువు మధ్యలో గోడ కట్టి రైతులకు ఇబ్బంది కలిగేలా ఇరిగేషన్ అధికారులు చేశారని మరో జెడ్పీటీసీ ప్రభాకర్ అడిగారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు జిల్లా అటవీ అధికారికి ఏ విధంగానైనా నచ్చజెప్పి గోడను తీయించే ప్రయత్నం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. అనంతరం మహిళా బిల్లు ఆమోదం పొందినందుకు సభా ముఖంగా మహిళలకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తస్వీర్‌లను సన్మానించారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఎస్పీ రమణకుమార్**



మాట్లాడుతున్న ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి మున్సిపాలిటీ: వచ్చే ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎస్పీ రమణ కుమార్ సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా శనివారం తన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. కోడ్ వచ్చిన నాటి నుంచి అధికారులందరూ ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తామన్నారు. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అందుకు మన వంతుగా వారికి అవగాహన కల్పించాలన్నారు. పాతనేరస్తులు, ఇదివరకు జరిగిన ఎన్నికలలో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ రైటర్స్ ఎలాంటి సమాచారం అడిగిన త్వరగా స్పందించాలని వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ ఎస్పీ రాములు తన అనుభవ పూర్వకమైన సలహాలు ఇచ్చారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయనను సత్కరించారు. సమావేశంలో డీఎస్పీలు రమేశ్‌కుమార్, రఘు, వెంకట్ రెడ్డి, పురుషోత్తం, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ బి.రమేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**చింతా ప్రభాకర్**





మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో తన సొంత నిధులతో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, జ్ఞాన జ్యోతిని ప్రసాదించి విజ్ఞానం వైపు నడిపించేది గురువులన్నారు. అనంతరం 800 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రం, మెమెంటో, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ విజయేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు దీక్ష



ఫీజు దీక్షలో విద్యార్థులు

నారాయణఖేడ్: పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఫీజు దీక్ష నిర్వహించారు. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొటారి నర్సింహులు దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్లుగా ఆయా చెల్లింపులు చేయకపోవడంతో రూ.5,117 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా మాజీ సహాయ కార్యదర్శి అరుణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కిందిదొడ్డి సతీశ్, జిల్లా, డివిజన్ నాయకులు శ్రీనివాస్, శ్రీరాం, పవన్, ప్రశాంత్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

## పట్టణంలో బైక్ చోరీలు


### ఆందోళనలో ప్రజలు

నారాయణఖేడ్: కొద్దిరోజులుగా బైక్‌ల దొంగతనాలు జరుగుతుండటంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని భజరంగ్‌దళ్ గణేశ్ మండపం వద్ద పార్క్ చేసిన మూఢ ప్రశాంత్‌కు చెందిన బైక్‌ను రెండు రోజులక్రితం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. తాజాగా ఏసురెడ్డికి చెందిన టీవీఎస్ ఎక్సెల్ ఇంటి ముందు ఉంచగా శనివారం గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. వాహన చోరీలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): దళితులకు ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని ఆత్మకూర్‌లో పర్యటించారు. ఇక్కడి దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న 101యూనిట్ల ఉచిత విద్యుత్‌ను గ్రామాల్లో అన్ని దళిత కుటుంబాలకు వర్తింపజేయాలన్నారు. దీనిని 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం, మండల కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

### సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

**99498 49479**

# అంగన్‌వాడీలపై చిన్నచూపు



మాట్లాడుతున్న టీజేఎస్ నేత ఆశప్ప

న్యాల్‌కల్(జహీరాబాద్): అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జన సమితి పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మొగుడంపల్లి ఆశప్ప డిమాండ్ చేశారు. న్యాల్‌కల్‌లో సమ్మె చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం చాలా రోజులుగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆందోళనలు ఉధృతం కాకుండా స్పందించాలన్నారు. ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు.

### ముప్పుతో సహవాసం



రైతులకు చెందిన భూముల్లో విద్యుత్ వైర్లు ఉన్నాయి. వాటిని తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వెంటనే వాటిని తొలగించాలని కోరుతున్నారు. గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామంలో ఇదీ పరిస్థితి..

- జిన్నారం (పటాన్‌చెరు)